ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5


అనకాపల్లి
జిల్లా వార్తలు
శుక్రవారం 22 మార్చి 2024

మాజీ ఎమ్మెల్యే ఇంట్లో దోపిడీ

- రాత్రి ఏడున్నర గంటల సమయంలో గేటు దూకి ఇంట్లోకి చొరబడిన దుండగుడు
- ఆయన భార్య మెడపై కత్తిపెట్టి బెదిరింపు
- మెడలోని బంగారం, బీరువాలోని నగదు, బంగారం తీసుకుని ఉడాయింపు

- 7లో

ఉత్తుత్తి బటన్ నొక్కుడేనా?

రెండు వారాలైనా రైతులకు అందని పంట నష్టపరిహారం


తుఫాన్ ప్రభావంతో నాతవరంలో నేలకొరిగి, నీట మునిగిన వరి పంట (ఫైల్ ఫొటో)

- గత ఏడాది డిసెంబర్ మొదటి వారంలో మిచౌంగ్ తుఫాన్
- నాతవరం మండలంలో 869 ఎకరాల్లో వరి పంటకు నష్టం
- ఎకరాకు రూ.6,800 చొప్పున రూ.59 లక్షల పరిహారం
- ఈ నెల 6వ తేదీన తాడేపల్లిలో బటన్ నొక్కి నిధులు విడుదల చేసిన సీఎం
- వెంటనే బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుందని వెల్లడి
- ఇంతవరకు డబ్బులు పడలేదంటున్న రైతులు
- తమకు సంబంధం లేదని చేతులెత్తేసిన స్థానిక అధికారులు

నాతవరం, మార్చి 21:

గత ఏడాది డిసెంబరులో సంభవించిన మిచౌంగ్ తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులు, పరిహారం కోసం రెండు వారాల నుంచి ఎదురు చూస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 6వ తేదీన బటన్ నొక్కి నిధులు విడుదల చేసి, వెంటనే ఆయా రైతుల బ్యాంకు ఖాతాలకు డబ్బులు నేరుగా జమ అవుతాయని చెప్పారు. దీంతో రైతులు రోజూ సమీపంలోని బ్యాంకు వెళ్లడం, పరిహారం నగదు తమ ఖాతాకు జమ అయ్యిందా? అని సిబ్బందిని అడగడం, ఇంకా పడలేదని వారు చెప్పడం, రైతులు నీరసంగా ఇంటిముఖం దినచర్యగా మారింది.

గత ఏడాది డిసెంబరు మొదటి వారంలో సంభవించిన మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల వల్ల నాతవరం మండలంలో వందలాది ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నది. వ్యవసాయ, రెవెన్యూ శాఖల సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం 985 మంది రైతులకు చెందిన 869 ఎకరాల్లో మాత్రమే వరి పంటకు నష్టం వాటిలినట్టు నిర్ధారించారు. ఈ మేరకు ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపారు. జనవరి నెలలో నష్టపరిహారం అందుతుందని అప్పట్లో అధికారులు, వైసీపీ నేతలు చెప్పారు. కానీ ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. ఫిబ్రవరిలో కూడా ఇదే పరిస్థితి. ఎట్టకేలకు మార్చి 6వ తేదీన తుఫాన్ పంట నష్టపరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) నిధులను సీఎం జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని సీఎంఓ నుంచి బటన్ నొక్కి విడుదల చేశారు. కొద్దిసేపట్లోనే రైతుల బ్యాంకు ఖాతాలకు నష్టపరిహారం సొమ్ము జమ అవుతుందని చెప్పారు. ఎకరాకు రూ.6,800 చొప్పున నాతవరం మండలంలో 869 ఎకరాల్లో వరి పంట నష్టపోయిన రైతులకు సుమారు 59 లక్షల రూపాయలు మంజూరైనట్టు వ్యవసాధికారి శైలజ అప్పట్లో తెలిపారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కిన మరుసటి రోజు నుంచి రైతులు నిత్యం బ్యాంకులకు వెళ్లడం, పంట నష్టపరిహారం నగదు జమ గురించి వాకబు చేయడం, డబ్బులు పడలేదని సిబ్బంది చెప్పడం, ఉసూరుమంటూ ఇంటికి తిరుగుముఖం పట్టడం పరిపాటిగా మారింది. సీఎం బటన్ నొక్కి నిధులు విడుదల చేసి రెండు వారాలు దాటిందని, పంట నష్టపరిహారం ఇంకెప్పుడు అందుతుందని రైతులు ఆవేదనతో ప్రశ్నిస్తున్నారు.

కాగా మిచౌంగ్ తుఫాన్ వల్ల పంట నష్టపోయిన రైతులకు ఇంతవరకు పరిహారం అందకపోవడంపై వ్యవసాయ శాఖ ఏడీ ప్రసాద్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ఈ నెల 6వ తేదీన సీఎం బటన్ నొక్కి నిధులు విడుదల చేశారని, రైతులు బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అవుతాయని, ఇందులో తమ ప్రమేయం ఏమీ వుండదని చెప్పారు. అయినప్పటికీ రైతుల బ్యాంకు ఖాతాలకు నష్టపరిహారం డబ్బులు జమ కాని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని తెలిపారు.

రెండు వారాలైనా నష్టపరిహారం అందలేదు



మిచౌంగ్ తుఫాన్ కారణంగా ఎకరం పొలంలో వరి పంట పూర్తిగా దెబ్బతిన్నది. అధికారులు వచ్చి పంటను పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. పంట నష్టపోయిన రైతుల జాబితాలో నా పేరు కూడా వుంది. నష్టం పరిహారంగా ఎకరాకు రూ.6,800 చొప్పున కొద్ది రోజులోనే అందుతుందని అప్పట్లో అధికారులు చెప్పారు. ఎట్టకేలకే ఈ నెల ఆరో తేదీన సీఎం డబ్బులు విడుదల చేశారు. కానీ ఇప్పటి వరకు నా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడలేదు.

- బేతా రాములు, రైతు, గుమ్మిడిగొండ

రూ.30 వేలు పెట్టుబడి అయ్యింది



నేను గత ఏడాది ఖరీఫ్‌లో ఎకరా 20 సెంట్లలో వరి సాగు చేపట్టాను. డిసెంబరులో పంట కోతకు వచ్చిన సమయంలో తుఫాన్ రావడంతో మొత్తం పాడైపోయింది. అప్పటి వరకు సుమారు రూ.30 వేలు పెట్టుబడి అయ్యింది. అధికారులు వచ్చి పాడైపోయిన పంటను పరిశీలించారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుందని చెప్పారు. ఇది జరిగి మూడున్నర నెలలు అయినా నష్టపరిహారం అందలేదు.

- సుర్ల యరకయ్య, రైతు గుమ్మిడిగొండ

మృత్యుకుహరాలు

నదుల్లో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

- ఎక్కడపడితే అక్కడ భారీ గోతులు
- లోతును అంచనా వేయలేక నీటిలో దిగి ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం


శారదాలో జరుగుతున్న ఇసుక తవ్వకాలు

చోడవరం, మార్చి 21:

శారదా, పెద్దేరు నదుల్లో విచ్చలవిడిగా సాగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలతో ఏర్పడిన భారీ గోతులు మృత్యుకుహరాలుగా మారాయి. నదుల్లో ఎక్కడ గోతులు వున్నాయి, ఏ గొయ్యి ఎంత లోతు వుందో తెలియక నీటిలో దిగి ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రజలే కాకుండా పశువులు కూడా మృత్యువాతపడుతున్నాయి. కానీ ఇసుక తవ్వకాలను నిరోధించడానికి అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టడంలేదు. దీంతో అక్రమార్కులు నదుల్లో ఎక్కడపడితే అక్కడ పెద్ద మొత్తంలో ఇసుక తవ్వేస్తున్నారు.


పెద్దేరు నది మధ్యలో ఇసుక తవ్వకాలు జరుపుతున్న దృశ్యం

గతంలో గౌరీపట్నం గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు పొలాలకు వెళ్లేందుకు పెద్దేరు నది దాటుతుండగా ఇసుక తవ్వకాలు జరిపిన భారీ గుంతల్లో చిక్కుకుని మృత్యువాత పడ్డారు. గౌరీపట్నం గ్రామానికి చెందిన కోరుకొండ కొండలరావు(60) నదిని దాటుతూ నీటిలో మునిగి చనిపోయాడు. గజపతినగరం వద్ద శారదా నది వంతెన సమీపంలో నదిని దాటుతూ గోవాడ గ్రామానికి చెందిన వృద్ధుడు ఇసుక గుంతలో చిక్కుకుని మృతిచెందాడు. గవరవరం గ్రామం వద్ద గత నెల 27వ తేదీన మార్సూరు దేముళ్లు అనే వృద్ధుడు పొలం నుంచి ఇంటికి వెళ్లడానికి నది దాటుతూ ఇసుకాసురులు తవ్విన గొయ్యిలో పడి నీటమునిగి ప్రాణాలు కోల్పోయాడు. గత ఏడాది కార్తీక మాసంలో ముద్దుర్తి గ్రామం వద్ద భక్తుల సేవ కోసం వచ్చిన అనకాపల్లికి చెందిన విద్యార్థి నదిలో గల్లంతై మృతిచెందాడు. లక్కవరం గ్రామంలో ఓ రైతుకు చెందిన పశువులు నదిని దాటుతూ ఇసుక గుంతల్లో మునిగిపోయి చనిపోయాయి. కాగా చోడవరం మండలంలో గవరవరం, గోవాడ, జుత్తాడ, గజపతినగరం, గౌరీపట్నం, ముద్దుర్తి ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. శారదా, పెద్దేరు నదుల్లో ఇసుక తవ్వకాల వల్ల ఏర్పడిన గుంతల్లో పడి ఇటు మనుషులు, అటూ పశువులు మృత్యువాత పడుతున్నప్పటికీ అధికారులు మాత్రం ఇసుక తవ్వకాలను నిరోధించలేకపోతున్నారు.

ప్రాణం తీసిన ఇసుక గోతులు


యుగంధర్ (ఫైల్ ఫొటో)

- గోవాడ వద్ద శారదా నదిలో మునిగి యువకుడి మృతి
- మరొకరిని రక్షించిన స్థానికులు
- మృతుడి సొంతూరు గాజువాక దయాళ్‌నగర్
- మాడుగులలో బంధువు అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా ఘటన

- 7లో

ముగ్గురు వార్డు వలంటీర్లపై వేటు

- వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నందుకు విధుల నుంచి తొలగింపు

నర్సీపట్నం, మార్చి 21: వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ముగ్గురు వార్డు వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్టు నర్సీపట్నం రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హెచ్‌వీ జయరామ్ గురువారం తెలిపారు. పెదబొడ్డేపల్లి సచివాలయం పరిధిలో పని చేస్తున్న వైదేశి సంతోశ్, చిటికెల శ్రీను, నర్సీపట్నం కొత్తవీధి సచివాలయం పరిధిలో పని చేస్తున్న పరవాడ సురేశ్ అధికార పార్టీ తరపున ఎన్నికల ప్రచారం చేస్తున్నట్టు ఫిర్యాదులు అందాయని, వీటిపై విచారణ జరపగా, వాస్తవమని తేలడంతో చర్యలు తీసుకున్నట్టు ఆయన వెల్లడించారు.

నీళ్ల తొట్టెలో పడి 18 నెలల బాలుడి మృతి

- కోడాపల్లి గిరిజన గ్రామంలో ఘటన


మృతిచెందిన బాలుడు గణేశ్

దేవరాపల్లి, మార్చి 21: ఏడాదిన్న వయసున్న బాలుడు ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ నీటి తొట్టిలో పడి మృతి చెందాడు. మండలంలోని వాలాబు శివారు కోడాపల్లిలో ఈ సంఘటన జరిగింది. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

వాలాబు పంచాయతీ కోడాపల్లి గిరిజన గ్రామానికి చెందిన చెరకు చంద్రరావు, జానకి భార్యాభర్తలు. వీరిలో 18 నెలల వయసున్న కుమారుడు (గణేశ్) వున్నాడు. గురువారం సాయంత్రం బాలుడు ఇంటి బయట ఆడుకుంటున్నాడు. తల్లిదండ్రులు ఇంటి పనుల్లో నిమగ్నమయ్యారు. కొద్దిసేపటి తరువాత బాలుడి అలికిడి లేకపోవడంతో జానకి ఇంటి నుంచి బయటకు వచ్చి చూసింది. కుమారుడు నీళ్ల తొట్టెలో మునిగి వుండడాన్ని గమనించి వెంటనే భర్తకు చెప్పింది. బాలుడిని బయటకు తీసి చికిత్స నిమిత్తం ద్విచక్ర వాహనంపై దేవరాపల్లి పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. కానీ అప్పటికే మృతి చెందాడని వైద్య సిబ్బంది చెప్పారు. దీంతో భార్యాభర్తలు కన్నీరుమున్నీరు అవుతూ మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్ర)	6.12
సహరి (శని)	4.46

నేత్రపర్వంగా ఉపమాక వెంకన్న కల్యాణోత్సవం


ఉపమాకలో కల్యాణం అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతంగా భక్తులకు దర్శనమిస్తున్న వెంకటేశ్వరస్వామి

ఉపమాక క్షేత్రంలో వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు ఘనంగా జరిగింది. వేలాది మంది భక్తులు హాజరై ఈ ఉత్సవాన్ని కనులారా తిలకించారు. అంతకుముందు ఎదురు సన్నాహ మహోత్సవం, మాఢవీధుల్లో గరుడ వాహనంపై స్వామివారు, గజ వాహనంపై ఉభయదేవేరుల ఊరేగింపు నిర్వహించారు. భక్తుల గోవింద నామస్మరణతో మాడవీధులు మారుమోగాయి. పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు ఘనంగా జరిపించారు.

- 7లో

చెత్త శుద్ధి లేదాయె!

పంచాయతీల్లో పడకేసిన సంపద కేంద్రాలు

- నిర్వహణను గాలికొదిలేసిన అధికారులు
- టీడీపీ హయాంలో కోటవురట్ల మండలంలో 20 పంచాయతీల్లో కేంద్రాల నిర్మాణం
- గ్రీన్ అంబాసిడర్లతో ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త సేకరణ
- ఏడాది తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ
- గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు బంద్
- మూతపడిన సంపద కేంద్రాలు
- గ్రామాల్లో పెరిగిన పారిశుధ్య లోపం
- రహదారుల పక్కన చెత్తాచెదారం డంపింగ్


కొత్తగొట్టివాడలో రోడ్డుపక్కన డంపింగ్ చేసిన చెత్త

కోటవురట్ల, మార్చి 21:

మండలంలో లక్షలాది రూపాయలు వ్యయం చేసిన నిర్మించిన 'చెత్త నుంచి సంపద తయారీ' కేంద్రాలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. మొత్తం 25 పంచాయతీలకుగాను 20 పంచాయతీల్లో టీడీపీ హయాంలో సంపద కేంద్రాలను నిర్మించారు. ప్రస్తుతం వీటిల్లో ఐదు గ్రామాల్లోనే కేంద్రాలు మాత్రమే వినియోగంలో వున్నాయి. మిగిలిన 15 గ్రామాల్లో నిరుపయోగంగా పడివున్నాయి.

స్వచ్ఛ భారత్ పథకం అమలు తరువాత గ్రామాల్లో పారిశుధ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిసారించాయి. వీధుల్లో సేకరించే చెత్తను శాస్త్రీయ విధానంలో వేరుచేసి తడి చెత్త నుంచి ఎరువు తయారీ చేయాలని, పొడి చెత్తను తుక్కు వ్యాపారులకు విక్రయించాలని నిర్ణయించారు. ఇందుకోసం 'చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు' ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు జిల్లాలోని అన్ని మండలాల మాదిరిగానే కోటవురట్ల మండలానికి కూడా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు మంజూరయ్యాయి. పంచాయతీ జనాభానుబట్టి ఒక్కో కేంద్రానికి రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉపాధి హామీ పథకం నుంచి ... మిగతా 8వ పేజీలో


టి.జగ్గంపేటలో తుప్పలు పెరిగిపోయి నిరుపయోగంగా మారిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

జగనన్న.. పార్లే ప్రాజెక్టు ఎక్కడన్నా??

సముద్ర తీరాన్ని ప్లాస్టిక్ రహితంగా మారుస్తామంటూ రెండేళ్ల కిందట ఆర్భాటం



- వ్యర్థాల పునర్వినియోగానికి ప్రతిపాదన
- 2022 ఆగస్టులో 'పార్లే ఫర్ ది ఓషన్స్' సంస్థతో ఒప్పందం
- ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి తయారైన ముడిసరకుతో రూపొందించిన కళ్లజోడు ధరించి మురిసిపోయిన సీఎం జగన్
- రూ.16 వేల కోట్ల పెట్టుబడులు, 20 వేల మందికి ఉద్యోగ అవకాశాలు అంటూ ప్రకటన
- ఏడాదిన్నరైనా కానరాని పురోగతి



సీఎం సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, పార్లే ఫర్ ది ఓషన్స్ సంస్థ ప్రతినిధి (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సముద్ర తీరాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చడంతో పాటు...సేకరించిన వ్యర్థాలతో దుస్తులు, కళ్లద్దాలు, బూట్లు వంటి వాటిని తయారుచేసేందుకు అమెరికాకు చెందిన 'పార్లే ఫర్ ది ఓషన్స్' సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం 2022 ఆగస్టు 27న ఒప్పందం చేసుకుంది. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి స్వయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో ఆ సంస్థ తయారుచేసిన వస్తువులను పట్టుకుని హడావుడి చేశారు. అయితే ఏడాదిన్నర గడిచిపోయినా ఆ ప్రాజెక్టు మాత్రం పట్టాలెక్కలేదు.

ప్రస్తుతం ఎక్కడచూసినా ప్లాస్టిక్ వస్తువులే కనిపిస్తున్నాయి. ప్రజలు ప్లాస్టిక్‌ను వాడేసిన తర్వాత కాలువలు, గెడ్డల్లో పడేస్తున్నారు. అవి నేరుగా సముద్రంలోకి చేరుకుంటున్నాయి. తీరంతోపాటు జలాలు కూడా కలుషితం అయిపోతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలోకి చేరడం వల్ల 267 రకాల జీవజాతుల మనుగడ దెబ్బతింటోంది. ఈ నేపథ్యంలో సముద్ర తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించడంతో పాటు వాటి రీసైక్లింగ్ చేయడం ద్వారా సమస్యను పరిష్కరించవచ్చునని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. దీనికోసం ప్లాస్టిక్ వ్యర్థాలతో అనేక రకాల ఉత్పత్తులను తయారుచేసే అమెరికాకు చెందిన ఎన్‌జీవో 'పార్లే ఫర్ ది ఓషన్స్', గ్లోబల్ అలయెన్స్ ఫర్ సస్టైనబుల్ ప్లానెట్ వర్క్స్ (జీఏఎస్‌పీ) అనే రెండు సంస్థలను సంప్రతించింది. ఆ సంస్థలు కూడా ముందుకు రావడంతో 2022 ఆగస్టు 27న ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించడానికి జీవీఎంసీ భారీగా డబ్బులు ఖర్చు చేసింది. సీఎం జగన్మోహన్‌రెడ్డి స్వయంగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆయన సమక్షంలోనే ప్రభుత్వం తరపున పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి..సంబంధిత సంస్థల ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి ... మిగతా 7వ పేజీలో

క్రైం... crime news

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఎలమంచిలి, మార్చి 21: ఎలమంచిలి రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం పట్టాలు దాటుతుండగా ఓ రైలు ఢీకొనడంతో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. ఎలమంచిలి నుంచి తుని వైపు వెళుతున్న రైలు ఢీకొట్టడంతో తలకు బలమైన గాయం కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్ఐ చెప్పారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ తన సిబ్బందితో పరిశీలించారు. మృతునికి సుమారు 56 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఎరుపు రంగుపై సిమెంట్ రంగు గడులు కలిగిన ఆఫ్ చేతులు చొక్కా, నలుపు రంగు మీద తెలుపు రంగు సన్నని చారలు కలిగిన ఫుల్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించామని తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు తుని రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

అనకాపల్లి టౌన్, మార్చి 21: ప్రమాదంలో గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఓ వృద్ధురాలు గురువారం ఉదయం మృతి చెందినట్టు పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. స్థానిక లక్ష్మీదేవిపేటకు చెందిన చింతకాయల లక్ష్మి(63) ఈ నెల 16వ తేదీన ఇంట్లోని బాత్‌రూములో కాలుజారి పడిపోయింది. తలకు బలమైన గాయం తగలడంతో కుటుంబసభ్యులు ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స నిమిత్తం చేర్పించగా, ప్రథమ చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం ఆమె మృతి చెందింది. ఆమె కుమార్తె వి.భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

తేనెటీగల దాడిలో ఒకరికి తీవ్రగాయాలు

రావికమతం, మార్చి 21: తేనెటీగల దాడిలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మండలంలోని మేడివాడలో జరిగింది. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం.. మేడివాడ గ్రామానికి చెందిన బండారు గోవింద్ చింతబొట్లు కోసం మెయిన్ రోడ్డు సమీపంలో ఉన్న చింత చెట్టు ఎక్కాడు. అప్పటికే చెట్టు కొమ్మకు తేనెపట్టు వుంది. దీనిని గమనించని గోవింద్.. చింతబొట్లు దులిపేందుకు కొమ్మను బలంగా ఊపాడు. దీంతో తేనెటీగలు ఒక్కసారిగా గోవింద్‌పై దాడిచేశాయి. తీవ్రగాయలై సొమ్మసిల్లి పడిపోయాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఆస్పత్రికి తరలించారు.

గంజాయి కేసులో ఐదుగురి అరెస్టు

» ఐదు వాహనాలు సీజ్.. మరో ఆరుగురి కోసం గాలింపు

విశాఖపట్నం, మార్చి 21: రెండు రోజుల క్రితం కొత్తపాలెంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గంజాయి పట్టుకున్న కేసులో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు డీసీపీ-2 ఎం.సత్తిబాబు మంగళవారం కేసు వివరాలను వెల్లడించారు. చీడికాడ మండలం భైలపూడి గ్రామానికి చెందిన గాడి సంతోశ్, విశాఖ పూర్ణామార్కెట్‌కు చెందిన గుమ్మాల పైడిరాజు, ఎర్రా మౌళి, సీతమ్మధారకు చెందిన నారికేళం గణపతి, కొత్తపాలేనికి చెందిన రాపేటి నూకేశ్‌లు తమకు పరిచయస్తులైన పవన్, ఆనంద్, త్రినాథ్ అనే వ్యక్తులతో కలిసి విశాఖ ఏజెన్సీలో ఇద్దరు వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేశారు. దీనిని కొత్తపాలెంలో నూకేశ్ బంధువు నిర్వహిస్తున్న టిఫిన్ షాపులో నిల్వ చేశారు. దీనిపై సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ షాపుపై దాడి చేసి 110 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని గోపాలపట్నం పోలీసులకు అప్పగించారు. గంజాయి రవాణా చేస్తున్న సంతోశ్, పైడిరాజు, మౌళి, గణపతి, నూకేశ్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఆరుగురి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్టు డీసీపీ తెలిపారు. గంజాయి తరలించడానికి వినియోగించిన మూడు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో, ఒక కారును సీజ్ చేశామన్నారు. గంజాయి నిల్వ చేసిన టిఫిన్ షాపును కూడా సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

20 లీటర్ల సారాతో ఒకరి అరెస్టు

గొలుగొండ, మార్చి 21: మండలంలోని సీతకండి గ్రామంలో 20 లీటర్ల సారాతో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. కొయ్యూరు మండలం రెల్లపాలెం గ్రామానికి చెందిన దూరి బోడేసు, సీతకండి శివారులో నాటుసారా కొనుగోలు చేసి, తన గ్రామంలో విక్రయించడానికి తీసుకెళుతున్నాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు దారిలో అటకాయించి బోడేసు వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారాను సాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రెండు వారాలపాటు రిమాండ్ విధించారు.

కోడి పందేలపై పోలీసులు దాడి, ఏడుగురి అరెస్టు

బుచ్చెయ్యపేట, మార్చి 21: మండలంలో నీలకంఠాపురంలో కోడి పందేల శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. కోడి పందేలు ఆడుతున్న ఏడుగురుని అరెస్టు చేసి, రెండు కోడి పుంజులు, రూ.4,700 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ డి.ఈశ్వరరావు తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన రసాయనాలు స్వాధీనం

పరవాడ, మార్చి 21: ఎటువంటి అనుమతులు లేకుండా రసాయనాల డ్రమ్ములను తోటల్లో నిల్వ చేసిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు దాడి చేసి 80 రసాయనాల డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి పరవాడ సీఐ బాలసూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాయుడుపాలెం పంచాయతీ పరిధి తమ్మయ్యపాలెం గ్రామానికి చెందిన పైలా జగదీశ్వరరావు కొంతకాలంగా ఇదే గ్రామానికి చెందిన చీపురుపల్లి దేముడు అనే వ్యక్తికి చెందిన కొబ్బరి తోటల్లో వ్యర్థ రసాయనాల డ్రమ్ములను నిల్వ చేసి విక్రయాలు సాగిస్తున్నాడు. ఈ వ్యవహారం కొంతకాలం పాటు గుట్టు చప్పుడు కాకుండా సాగింది. వ్యర్థ రసాయనాల కారణంగా విపరీతమైన దుర్వాసన రావడంతో స్థానికులు పోలీస్, రెవెన్యూ సిబ్బందికి సమాచారమిచ్చారు. దీంతో ఎస్ఐ సురేశ్, వీఆర్వో కమల తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మిథైనాల్‌క్లోరైడ్ 60 డ్రమ్ములు (ఎనిమిది వేల కేజీలు), మిక్సిడ్ సాల్వెంట్ 20 డ్రమ్ములు (మూడు వేల కేజీలు) ఉన్నట్టు గుర్తించారు. ఫార్మాసిటీ, ఎస్ఈజెడ్‌లో గల ఫార్మా పరిశ్రమల నుంచి తక్కువ ధరకు ఈ రసాయనాలు కొనుగోలు చేసి వీటిని ఎక్కువ ధరకు అమ్ముతున్నట్టు తెలిసింది. ఏయే పరిశ్రమల నుంచి కొనుగోలు చేసి ఇక్కడకు తీసుకువస్తున్నారో అనే దానిపై కూడా విచారణ చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం నిర్వాహకుడు జగదీశ్వరరావును అదుపులోకి తీసుకుని వివరాలను సేకరిస్తున్నామని సీఐ వెల్లడించారు.

20 మద్యం బాటిళ్లు స్వాధీనం

కశింకోట, మార్చి 21: కశింకోట రైల్వేగేటు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు అనకాపల్లి మండలం రామాపురం కాలనీకి చెందిన మురుగుతి రాజు నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కొనుగోలు చేసి తీసుకెళుతున్నట్టు అతను చెప్పాడని హెచ్‌సీ సూర్యారావు చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

10 బీరు బాటిళ్లు స్వాధీనం

కొత్తూరు, మార్చి 21: అనకాపల్లి మండలం గోపాలపురంలో యిళ్ల రవి అనే వ్యక్తి నడుపుతున్న షాపు (మద్యం బెల్టు షాపు)లో రూరల్ పోలీసులు గురువారం తనిఖీ చేశారు. పది బీరు సీసాలను స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపారు.

వలంటీరు తీరుపై ఆర్‌వోకు టీడీపీ నేత ఫిర్యాదు

ఎలమంచిలి, మార్చి 21: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఫొటోను మార్ఫింగ్ చేసి అసభ్యకర సందేశాలను గ్రూపుల్లో పంపుతున్న 25వ వార్డు పరిధిలోని వలంటీర్ డి.భాస్కరరావుపై ఎలమంచిలి రిటర్నింగ్ అధికారికి గురువారం ఫిర్యాదు చేసినట్టు టీడీపీ పట్టణ కార్యదర్శి ఆడారి వెంకటరమణబాబు తెలిపారు. నిబంధనల ప్రకారం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎలమంచిలి రిటర్నింగ్ అధికారిణి మనోరమను ఫోన్‌లో వివరణ అడుగగా ఈ ఫిర్యాదును సైబర్ క్రైమ్ అధికారులకు బదిలీ చేశామన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439



స్వామివారి కల్యాణం సందర్భంగా మంగళసూత్రాలను చూపుతున్న పురోహితులు, కల్యాణ వేడుకను తిలకిస్తున్న భక్తులు

కల్యాణ వైభోగమే..

» నేత్రపర్వంగా ఉపమాక వెంకన్న కల్యాణోత్సవం
» ముందుగా ఎదురు సన్నాహోత్సవం
» తదుపరి రథోత్సవం



నక్కపల్లి, మార్చి 21: ఉపమాక వెంకన్న వార్షిక కల్యాణోత్సవ ఘట్టం బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం రాత్రి 11 గంటలకు ఎదురు సన్నాహ మహోత్సవం జరిగింది. ఇత్తడి గరుడ వాహనంపై పసిడి ఆభరణాలతో స్వామివారు, ఇత్తడి గజ వాహనంపై ఉభయదేవేరులను అలంకరించి మాఢవీధుల్లో ఊరేగించారు. ఎదుర్కోలు ఉత్సవంలో భాగంగా వధూవరుల గుణగణాలు, పెండ్లిచూపులు, పెండ్లిమాటలు వంటి తంతును ప్రముఖ వేదపండితురాలు డాక్టర్ గాయత్రీదేవి అద్భుతంగా భక్తులకు వివరించారు. బంగారు ఆభరణాలు, వజ్ర వైఢూర్యాలతో స్వామివారిని, అమ్మవారిని ఊరేగించడంతో డీఎస్పీ మోహన్, సీఐలు విజయ్‌కుమార్, అప్పన్న నేతృత్వంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం స్వామివారిని రథంపై అలంకరించి మాఢవీధుల్లో ఊరేగించారు.

కల్యాణ శోభ

రథోత్సవం అనంతరం బుధవారం అర్ధరాత్రి 2 గంటల తరువాత ఆలయ ప్రధాన రాజగోపురం పక్కన ఏర్పాటు చేసిన వేదిక వద్ద శ్రీవారి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు, వేదపండితుల బృందం నిర్వహించింది. పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం స్వామివారి వార్షిక కల్యాణోత్సవాన్ని ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, నర్సింహాచార్యులు, సాయి గోపాలాచార్యులు, నందూరి రాజగోపాలాచార్యులు జరిపించారు. కాగా జిల్లా వ్యాప్తంగా బుధవారం వర్షం కురవగా ఉత్సవాలకు ఆటంకం కలుగుతుందని భక్తులు, ఆలయ అధికారులు ఆందోళన చెందారు. అయితే బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణం జరిగే వరకు ఒక్క చినుకు కూడా కురవలేదు. దీంతో ఎప్పటిలాగా ఉత్సవాలన్నీ భక్తుల సమక్షంలో ఘనంగా జరిగాయి. స్వామివారు మహిమాన్వితుడని, అందుకే ఉత్సవానికి ఆటంకం కలగలేదని పలువురు భక్తులు చర్చించుకున్నారు.

ముందు ఫోన్ పెట్టెయ్...

» రహదారి గురించి ఫోన్ చేసిన గ్రామస్థుడికి దురుసుగా ఎమ్మెల్యే కన్నబాబురాజు సమాధానం
» సోషల్ మీడియాలో వైరల్

అచ్యుతాపురం, మార్చి 21: తమ గ్రామానికి రోడ్డు వేయాల్సిందిగా ఫోన్ చేసిన వ్యక్తికి అనకాపల్లి జిల్లా ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు దురుసుగా సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం ఈ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వివరాల్లోకి వెళితే...అచ్యుతాపురం మండలం ఆవరాజాం గ్రామానికి రోడ్డు సగంవేసి వదిలేశారు. గ్రామస్థుడు ఒకరు...కన్నబాబురాజుకు ఫోన్ చేసి రహదారి నిర్మాణం పూర్తి చేయించాల్సిందిగా కోరారు. అందుకు ఆయన 'ఫోన్ పెట్టు' అంటూ దురుసుగా సమాధానం ఇచ్చారు.

కన్నబాబురాజు: హలో ఎవరు..
గ్రామస్థుడు: ఆవరాజాం నుంచి మాట్లాడుతున్నాను సార్.
కన్నబాబు రాజు: ఆ..
గ్రామస్థుడు: సార్..ఏంటండి. మా గ్రామానికి రోడ్డు సగం వేసి ఆపేస్తున్నారు.
కన్నబాబురాజు: పెట్టు ఫోను
గ్రామస్థుడు: సార్..
కన్నబాబురాజు: పెట్టు ఫోన్, పెట్టు ఫోన్
గ్రామస్థుడు: ఏంటి సార్...మామూలుగా మాట్లాడుతుంటే అలాగంటారు.
కన్నబాబురాజు: ఆ...
గ్రామస్థుడు: మామూలుగా మాట్లాడుతుంటే ఫోన్ పెట్టేమంటున్నారు.
కన్నబాబురాజు: సగం వేసి ఆపేస్తే నువ్వెవరివి చెప్పడానికి...
గ్రామస్థుడు: అదికాదు సార్...పూర్తిగా వేస్తే బాగుంటుంది కదా
కన్నబాబురాజు: ఆ...సరెసరె మంచిదమ్మ. ఫోన్ పెట్టు.
గ్రామస్థుడు: సార్ ఆలాగంటారేంటండి
కన్నబాబురాజు: ఫోన్ పెట్టమని చెప్పానా....
గ్రామస్థుడు: అలాగైతే మీరే పెట్టేయండి...

ప్రస్తుతం ఈ వాయిస్ రికార్డు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఎన్నికలు దగ్గర పడుతున్నా కన్నబాబురాజు తన దురుసు ప్రవర్తన మానుకోలేదని ప్రజలు బహిరంగంగానే అంటున్నారు. గతంలో గడప గడపకు కార్యక్రమంలోకూడా కన్నబాబు రాజు ఇదే విధంగా ప్రవర్తించారు.

మాజీ ఎమ్మెల్యే ఇంట్లో దోపిడీ

» రాత్రి ఏడున్నర గంటల సమయంలో గేటు దూకి ఇంట్లోకి చొరబడిన దుండగుడు
» ఆయన భార్య మెడపై కత్తిపెట్టి బెదిరింపు
» మెడలోని బంగారం, బీరువాలోని
» నగదు, బంగారం తీసుకుని ఉడాయింపు



సీసీ టీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్న పోలీసులు

విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ ఇంట్లో గురువారం రాత్రి దోపిడీ జరిగింది. తైనాల ఎస్.కోటలో ఎన్నికల ప్రచారానికి వెళ్లగా, ఇంట్లో ఆయన భార్య ఒక్కరే ఉన్నారు. ఆమెను దుండగుడు కత్తితో బెదిరించి సుమారు రూ.8 లక్షల నగదుతోపాటు నగలు అపహరించుకుపోయాడు. దీనికి సంబంధించి టూటౌన్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాలు...

విశాఖ డాబాగార్డెన్స్‌లోగల లలితా కాలనీలో తైనాల విజయ్‌కుమార్ నివాసం ఉంటున్నారు. ఇద్దరు కుమారులు ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడడంతో భార్యాభర్తలు ఇద్దరే ఉంటున్నారు. విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ఎస్.కోట నియోజకవర్గ పరిశీలకుడిగా ఉన్న తైనాల విజయ్‌కుమార్ అక్కడ అభ్యర్థుల తరపున ప్రచారంలో పాల్గొంటున్నారు. గురువారం మధ్యాహ్నం ఎంపీ అభ్యర్థిని బొత్స ఝాన్సీలక్ష్మి పర్యటన ఉండడంతో ఆయన అక్కడకు వెళ్లారు. ఆ సమయంలో తైనాల భార్య ఒక్కరే ఇంట్లో ఉన్నారు. రాత్రి ఏడున్నర గంటల సమయంలో ముఖానికి మాస్క్‌తోపాటు నెత్తిన టోపీ పెట్టుకుని ఒక వ్యక్తి ఇంటి ప్రహరీ దూకి లోనికి చొరబడ్డాడు. నేరుగా కిచెన్‌లోకి వెళ్లి అక్కడ వంట పనిలో నిమగ్నమై ఉన్న తైనాల భార్య మెడపై కత్తి పెట్టి చంపేస్తానని బెదిరించాడు. ఆమె మెడలోని బంగారం తాడు, గొలుసుని తీసుకున్నాడు. అనంతరం ఇంట్లో ఉన్న బంగారం, నగదు ఇచ్చేయాలని లేనిపక్షంలో చంపేస్తానని బెదిరించాడు. దీంతో ఆమె బీరువాలో ఉన్న రూ.8 లక్షల నగదు, బంగారాన్ని చూపించడంతో వాటిని తీసుకుని దుండగుడు అక్కడి నుంచి ఉడాయించాడు. ఈ విషయం ఆమె వెంటనే తన భర్తకు చెప్పేందుకు యత్నించగా అక్కడ ప్రచారం హోరులో ఆయన ఫోన్ తీయలేదు. దీంతో తైనాల కారు డ్రైవర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పారు. అతని ద్వారా విషయం తెలుసుకున్న తైనాల వెంటనే ఇంటికి చేరుకున్నారు. తైనాల బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. సమాచారం అందిన వెంటనే డీసీపీ-1 మణికంఠ చందోలు, క్రైమ్‌డీసీపీ వెంకటరత్నం, సీసీఎస్ ఏసీపీ ఎ.వెంకటరావు, టూటౌన్ సీఐ తిరుమలరావు, క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

తెలిసిన వారి పనేనని అనుమానం

తైనాల ఇంట్లో జరిగిన దోపిడీ తెలిసినవారి పనే అయివుంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. తైనాల ప్రతిరోజూ మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత ఎస్.కోట వెళుతున్నారని, ఆ సమయంలో ఆయన భార్య మాత్రమే ఇంట్లో ఉంటున్నట్టు గమనించిన వ్యక్తులే దోపిడీకి వ్యూహం పన్ని ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇంట్లోకి చొరబడిన వ్యక్తి తెలుగులో స్పష్టంగా మాట్లాడాడని, మధ్యలో ఎవరో ఫోన్ చేసి ఇంకా రాలేదమని ప్రశ్నిస్తే, పనైపోయింది వచ్చేస్తానని..చెప్పాడని పోలీసులకు తైనాల భార్య తెలిపారు. దీంతో ఇద్దరు స్థానికులు దోపిడీకి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. తైనాల ఇంటి వద్ద సీసీ కెమెరాలతోపాటు ఎదురుగా ఉన్న వైస్రాయ్ విల్లా అపార్ట్‌మెంట్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించిన పోలీసులు ఒకరు ద్విచక్ర వాహనంపై ఇంటి బయట వేచి ఉండగా, ఒకరు ఇంట్లోకి ప్రవేశించినట్టు నిర్ధారించుకున్నారు. సీసీ కెమెరాలతోపాటు సెల్‌ఫోన్ టవర్ లొకేషన్, ఘటనా స్థలంలో లభ్యమైన వేలిముద్రల ఆధారంగా నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ప్రాణం తీసిన ఇసుక గోతులు

గోవాడ వద్ద శారదా నదిలో మునిగి యువకుడి మృతి



యుగంధర్ మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న అగ్నిమాపక సిబ్బంది (ఇన్‌సెట్‌లో) నదిలో మునిగి చనిపోయిన యుగంధర్



ప్రాణాలతో బయటపడిన రామకృష్ణ

చోడవరం, మార్చి 21: శారదా నదిలో అక్రమ ఇసుక తవ్వకాలకు ఓ యువకుడు బలయ్యాడు. మండలంలోని గోవాడ వంతెన వద్ద శారదా నదిలో గురువారం మధ్యాహ్నం స్నానానికి దిగిన యువకుడు, ఇసుక తవ్వకాలతో ఏర్పడిన పెద్ద గొయ్యిలో మునిగి మృతిచెందాడు. నీటిలో మునిగిపోతున్న మరో యువకుడిని స్థానికులు కాపాడారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు, ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన యువకుడు తెలిపిన వివరాలిలా వున్నాయి.

గాజువాక దయాళ్‌నగర్‌కు చెందిన పెంటకోట యుగంధర్(31), బీశెట్టి రామకృష్ణ వరుసకు సోదరులు అవుతారు. మాడుగులలో బంధువు ఒకరు చనిపోవడంతో గురువారం ఉదయం అంత్యక్రియలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమం ముగిసిన తరువాత తిరిగి దయాళ్‌నగర్ వెళుతూ మార్గమధ్యంలో గోవాడ వద్ద శారదా నదిలో స్నానం చేసేందుకు ఉపక్రమించారు. తొలుత యుగంధర్ నదిలో దిగి కొంచెం ముందుకు వెళ్లగా.. అక్కడ గతంలో ఇసుక తవ్వకాల వల్ల ఏర్పడిన భారీ గొయ్యిలో పడిపోయాడు. అధిక లోతు వుండడంతోపాటు ఈత రాకపోవడంతో పైకి రాలేక గట్టిగా కేకలు వేశాడు. ఇది గమనించిన రామకృష్ణ... యుగంధర్‌ను కాపాడడానికి నదిలో దిగాడు. ఇతనికి కూడా ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. సమీపంలో వున్న స్థానికులు గమనించి హుటాహుటిన సంఘటన స్థలానికి వచ్చి రామకృష్ణను కాపాడి ఒడ్డుకు చేర్చారు. యుగంధర్ అప్పటికే నీటిలో మునిగిపోయాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటి తరువాత యుగంధర్ మృతదేహాన్ని వెలికి తీశారు. ప్రాణాలతో బయటపడిన రామకృష్ణను 108 వాహనంలో చోడవరం సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు.

విశాఖ ఉక్కుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు లోకనాథం ఆరోపణ

అనకాపల్లి టౌన్, మార్చి 21: విశాఖ ఉక్కుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు కె.లోకనాథం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అన్నిరకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన సొంత గనులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నదన్నారు. అలాగే రూ. ఐదువేల కోట్ల వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వలేదన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుందన్నారు. నిర్వాసితులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఉక్కు పరిశ్రమను కాపాడాలని, లేకుంటే రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు.

సోషల్ మీడియా పోస్టులపై నిఘా

» తప్పుడు సమాచారం ప్రచారం చేస్తే చర్యలు
» అడ్మిన్లు బాధ్యతగా వ్యవహరించాలి » ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో సోషల్ మీడియా పోస్టింగులు, ట్రోలింగ్స్‌పై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారం చేసినా, ట్రోలింగ్స్ చేసినా తీవ్రంగా పరిగణిస్తామన్నారు. వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో అడ్మిన్లు బాధ్యతతో మెలగాలని సూచించారు. అభ్యంతరకరమైన తప్పుడు వార్తలు ప్రచురణ అవుతున్నట్లయితే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. గ్రూపులో ఎవరైన సభ్యుడు అభ్యంతరకరంగా ప్రవర్తిస్తే అడ్మిన్ వారిని గుర్తించి తొలగించాలని సూచించారు.

పోలీస్ కంట్రోల్ రూమ్....

ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు సమాచారం అందించేందుకు వీలుగా పోలీసు కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. సమాచారాన్ని ఫోన్ నంబరు 9440 904229 కు అందజేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ప్రధాన గెడ్డలో పైపులు తొలగింపు



గెడ్డలో పైపులు తొలగించిన తరువాత... (ఇన్‌సెట్‌లో) గతంలో గెడ్డలో వేసిన పైపులు

లంకెలపాలెం, మార్చి 21: ప్రైవేటు లేఅవుట్‌కు రహదారి నిమిత్తం ప్రధాన గెడ్డలో కల్వర్టు నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన పైపులను గురువారం నీటి పారుదల శాఖ అధికారులు తొలగించారు. లంకెలపాలెం రెవెన్యూ పరిధి సర్వే నంబరు 143లో ఓ లేఅవుట్‌కు రోడ్డు కోసం ప్రధాన గెడ్డలో అక్రమంగా పైపులు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీనిపై 'అక్రమార్కుల అడ్డదారి' శీర్షికన ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో నీటిపారుదల శాఖ అధికారులు స్పందించారు. ఏఈ రామలక్ష్మణ్ తన సిబ్బందితో గురువారం ఆ గెడ్డను పరిశీలించారు. అనుమతులు లేకుండా ఈ విధంగా పైపులు ఏర్పాటు చేస్తే నేరమని లేఅవుట్ నిర్వాహకులకు చెప్పారు. వెంటనే తొలగించాలని, లేకుంటే కేసులు పెడతామని హెచ్చరించారు. దీంతో ఆ వ్యక్తులు ప్రధాన గెడ్డలోని పైపులను తొలగించారు.

మృతిచెందిన హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

అనకాపల్లి రూరల్, మార్చి 21: చోడవరం పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల మృతిచెందిన సీహెచ్ సింహాచలంనాయుడు కుటుంబానికి జిల్లాలోని హోంగార్డులు ఒక రోజు వేతనం రూ.3,91,920 సమకూర్చారు. ఈ నగదును సింహాచలంనాయుడు భార్య లక్ష్మికి గురువారం ఎస్పీ కేవీ మురళీకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్, ఏవో శారదా తదితరులు పాల్గొన్నారు.

మూట్ కోర్టు పోటీల్లో డీఎస్ఎన్ఎల్‌యూ విద్యార్థుల ప్రతిభ

సబ్బవరం, మార్చి 21: మేఘాలయ నేషనల్ లా వర్సిటీ, ఎన్‌హెచ్ఆర్‌సీ సంయుక్తంగా ఈ నెల 15 నుంచి 18 వరకు నిర్వహించిన జాతీయ మూట్ కోర్టు పోటీల్లో స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆ విద్యార్థులను వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు గురువారం అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తమ విద్యార్థులు అథర్వ్ ఆర్ణవ్, కౌశిక్‌శర్మ, అభ్యుదయ్ మిశ్రా బృందం ప్రాథమిక రౌండ్‌లోనే తమ ప్రతిభను కనబరిచి అత్యున్నత ర్యాంక్ పొందిన జట్టుగా నిలిచిందన్నారు. ఈ పోటీల్లో అథర్వ్ ఆర్ణవ్ ఉత్తమ వక్తగా, కౌశిక్ రెండవ ఉత్తమ వక్తగా నిలిచారన్నారు. అభ్యుదయ్ మిశ్రా చేసిన పరిశోధనకు మొదటి బహుమతి లభించిందన్నారు.

జగనన్న.. పార్లే ప్రాజెక్టు ఎక్కడన్నా??

... 5వ పేజీ తరువాయి

ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారుచేసిన కళ్లజోడును పెట్టుకుని మురిసిపోయారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారుచేసిన షూను చూపిస్తూ ఫొటోలకు ఫోజులిచ్చారు. పార్లే సంస్థ విశాఖలోనే రూ.16 వేల కోట్ల పెట్టుబడితో యాన్ తయారీ యూనిట్‌ను ఏర్పాటుచేస్తుందని, దీనివల్ల 20 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రకటించారు. ఈ ప్రాజెక్టులో జీఏఎస్‌పీ సంస్థ ప్లాస్టిక్ వ్యర్థాలపై పోరుకు భాగస్వామ్యులను ఎంపిక చేసుకోవడం, ప్లాస్టిక్ ఏరివేత, పునర్వినియోగంపై వినూత్న ఆలోచనలను రూపొందించడం, దీనికోసం అవసరమయ్యే ఆర్థిక వనరులను సమకూర్చే మార్గాలను గుర్తించడం, గ్రీన్ క్లైమేట్ ఛేంజ్‌కోసం సలహాలు, సూచనలు ఇస్తుందని, 'పార్లే ఫర్ ది ఓషన్స్' సంస్థ తీరం వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించడం, వాటిని ఇతర ఉత్పత్తుల తయారీకి అవసరమయ్యే ముడిసరకు (యాన్)గా మార్చి...ప్రపంచంలో పేరొందిన అడిడాస్, మెర్సిడెజ్ బెంజ్, లూయిస్ విట్టన్, అమెరికన్ ఎక్స్‌ప్రెస్ వంటి కంపెనీలకు సరఫరా చేస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల విశాఖ బీచ్ స్వరూపమే మారిపోతుందని, ప్లాస్టిక్ పునర్వినియోగంలో ఏపీ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుందని గొప్పలు చెప్పారు. అయితే ఒప్పందం జరిగి ఏడాదిన్నర అయినా ఆ ప్రాజెక్టుకు సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకుపడలేదు. ఒప్పంద పత్రాలు మార్చుకోవడంతోనే ప్రాజెక్టు కథ ముగిసిపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'పార్లే ఫర్ ది ఓషన్స్' సంస్థతో ఒప్పందం కోసం సీఎం నగరానికి వస్తున్నారంటూ నగర సుందరీకరణ పేరుతో జీవీఎంసీ అధికారులు రూ.లక్షలు వెచ్చించారు. కార్యక్రమ నిర్వహణ కోసం భారీ ఏర్పాట్లు చేయడంతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారుచేసిన ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఇంతవరకూ ప్రాజెక్టుకు సంబంధించి కనీసం చర్చ కూడా లేకపోవడం గురించి జీవీఎంసీ అధికారుల వద్ద ప్రస్తావించగా అసలు ఆ ప్రాజెక్టు ఒకటి ఉందనే విషయం తమకు గుర్తులేదన్నట్టుగా మాట్లాడడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

ఘనంగా ముత్యాలమ్మ పండుగ

కశింకోట, మార్చి 21 : మండలంలోని పాత కన్నూరు పాలెంలో ముత్యాలమ్మ పండుగ గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకునేందుకు పోటీ పడ్డారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాటు చేశారు.

ఇసుక ట్రాక్టర్‌కు జరిమానా

కశింకోట, మార్చి 21 : ఎటువంటి బిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌కు రూ.10వేలు జరిమానా విధించామని సీఐ వినోద్‌బాబు గురువారం తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపినా సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఒకటి, రెండు సార్లు జరిమానా విధిస్తామని, మూడోసారి పట్టుబడితే ఆ వాహనాన్ని సీజ్ చేస్తామని సీఐ హెచ్చరించారు.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

అనకాపల్లి టౌన్, మార్చి 21 : స్థానిక నరసింగరావుపేటలో క్షయ వ్యాధి పై గురువారం అవగాహన ర్యాలీ జరిగింది. డీఎల్ఏటీవో డాక్టర్ ఎంఎస్వీ బాలాజీ ఆధ్వర్యంలో జరుగుతున్న టీబీ వారోత్సవాల్లో భాగంగా నరసింగరావుపేటలోని పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఔను మనం టీబీని అంతం చేయగలం అనే నినాదంతో యూపీహెచ్‌సీలో ఉన్న సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ నీరజ, డీపీసీ అయ్యప్పరెడ్డి, యల్లాజీ, పెంటయ్య వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

27, 28న జిల్లా స్థాయి కోలాటం పోటీలు

పరవాడ, మార్చి 21 : మండలంలోని రావాడ పంచాయతీ పరిధి జల్లెలపాలెంలో మరిడిమాంబ ఆలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 27,28 తేదీల్లో జిల్లా స్థాయి కోలాటం పోటీలను నిర్వహించనున్నట్టు నిర్వాహకులు గురువారం తెలిపారు. విజేతలకు వరుసగా రూ. 20వేలు, రూ. 15వేలు, రూ. 10వేలు నగదుతోపాటు జ్ఞాపికలను అందజేస్తామన్నారు. ఆసక్తి గల వారు ఆలయ కమిటీ ప్రతినిధులను సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

పాఠశాలకు టవర్ ఫ్యాన్ బహూకరణ

అచ్యుతాపురం, మార్చి 21: తిమ్మరాజుపేట సర్పంచ్ శరగడం భాగ్యలక్ష్మి, శివబాబునాయుడు మనవడు పుట్టిన రోజు సందర్భంగా గ్రామంలోని పాఠశాలకు టవర్ ఫ్యాన్‌ని గురువారం బహూకరించారు. రానున్న వేసవిలో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని హెచ్‌ఎం మారిశెట్టి వేంకటప్పారావు అన్నారు.

'వైసీపీ పాలనకు రోజులు దగ్గర పడ్డాయి'

రాంబిల్లి, మార్చి 21 : రాష్ట్రంలో నియంత పాలన సాగించిన వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కశిరెడ్డి ప్రసాద్ అన్నారు. గురువారం ఆయనిక్కడ విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ మార్చిన 81 స్థానాల్లో కేవలం 9 స్థానాల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారిని మార్చారని, బడుగు, బలహీన వర్గాల వారిని 90 శాతం మార్చారన్నారు. 52 శాతం ఉండే బీసీలకు 91 స్థానాలు రావాల్సి ఉండగా కేవలం 41 స్థానాలు కేటాయించి బీసీలకు అన్యాయం చేసుకోమన్నారు. బీసీలను వైసీపీ ప్రభుత్వం అన్నివిధాల మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు లాలం తాతబాబు, చోడిపల్లి సత్యనారాయణ, దేముడు తదితరులు పాల్గొన్నారు.

'ఓటమి భయంతో వైసీపీ నేతలు నీచ రాజకీయాలు'

రాంబిల్లి, మార్చి 21 : ఎలమంచిలి నియోజకవర్గంలో ఓటమి భయంతో వైసీపీ నేతలు నీచరాజకీయాలకు పాల్పడుతున్నారని జనసేన పార్టీ మండల అధ్యక్షులు పప్పల నూకన్నదొర అన్నారు. మండలంలోని హరిపురం పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తపట్నంలో వైసీపీకి చెందిన వారు టీడీపీ నుంచి వైసీపీలోకి వచ్చారంటూ ఎమ్మెల్యే కన్నబాబు రాజు సమక్షంలో వైసీపీ కండువాలు వేసి నీచరాజకీయాలకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. వైసీపీ ఎనిన్ని గిమ్మిక్కులు చేసిన ఎలమంచిలిలో ఉమ్మడి అభ్యర్థి గెలుపు తథ్యమని జనసేన మండల అధ్యక్షులు నూకన్నదొర తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా లీగల్‌సెల్ మెంబరు పొట్నూరి శివశంకర్, నేతలు ఎరుపల్లి నాగరాజు, చోడిపల్లి గంగరాజు, ఉరిటి నానాజీ,బద్రి తదితరులు పాల్గొన్నారు.

కొణతాలకు నందగోపాల్ కుటుంబం మద్దతు



కొణతాల రామకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గంధం నందగోపాల్ కుటుంబ సభ్యులు

కొత్తూరు, మార్చి 21 : తెలుగుదేశం, బీజేపీ, జనసేన అనకాపల్లి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణను కశింకోటకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గంధం నందగోపాల్ కుటుంబ సభ్యులు గురువారం రింగు రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా నందగోపాల్ సతీమణి, కుమార్తెతోపాటు పలువురు కుటుంబ సభ్యులు కొణతాలకు పుష్పగుచ్ఛం ఇచ్చి మద్దతు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో కొణతాల విజయానికి కృషి చేస్తామని ప్రకటించారు. నందగోపాల్ గతంలో అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి తెలుగుదేశం పార్టీ నాయకులు పప్పల చలపతిరావు చేతిలో స్వల్ప తేడాతో ఓటమి చెందారు. కశింకోట మండలంలోని నందగోపాల్ కుటుంబానికి మంచి పట్టుఉంది. వారు కొణతాలకు మద్దతు తెలియజేయడంతో ఉమ్మడి పార్టీల్లో హర్షం వ్యక్తమవుతోంది.

లోక్‌సత్తా పార్టీ మద్దతు శుభపరిణామం

జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి కూటమికి లోక్‌సత్తా పార్టీ మద్దతు తెలియజేయడం శుభపరిణామమని జనసేన అనకాపల్లి అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీని రామకృష్ణ సత్కరించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఒక మేధావి జయప్రకాష్ నారాయణ వంటి వ్యక్తి ఉమ్మడి కూటమిని స్వాగతించడం హర్షనీయమన్నారు. నిస్వార్థ నాయకుడని జయప్రకాష్ నారాయణను కొనియాడారు. మూడు పార్టీల పొత్తు ప్రజలకు ఎంతో అవసరమన్నారు. ఉమ్మడి కూటమి విధానాలకు ఆయన మద్దతు తెలియజేసిన విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ విజ్ఞత కలిగిన నేత కొణతాల అని కొనియాడారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొణతాల సేవలు అవసరమన్నారు. త్వరలోనే అనకాపల్లిలో సమావేశం ఏర్పాటు చేసి జయప్రకాష్ నారాయణను తీసుకురావడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కొణతాల బాలబాబు, భరత్‌బాబు, టీడీపీ నేతలు కర్రి బాబి, జనసేన నేతలు దూలం గోపీ, గెంజి సత్యారావు, ఈశ్వర్ పాల్గొన్నారు.

మెయిన్‌రోడ్డుపై చెత్త తొలగింపు

- పారిశుధ్య పనులు చేపట్టిన పంచాయతీ అధికారులు
- ఆంధ్రజ్యోతి ఎఫెక్టు

కోటవురట్ల, మార్చి 21: స్థానిక మెయిన్ రోడ్డుకు పక్కనే నిల్వ చేసిన చెత్తచెదారాన్ని పంచాయతీ అధికారులు రెండు రోజుల్లో తొలగించారు. మెయిన్ రోడ్డుపై పారిశుధ్యం అధ్వానంగా ఉందని 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 19వ తేదీన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై జిల్లా పంచాయతీ అధికారిణి శిరీషారాణి స్పందించారు. ఇళ్లలో నుంచి సేకరించిన చెత్త, చెదారాన్ని పారిశుధ్య కార్మికులు తీసుకువచ్చి మెయిన్‌రోడ్డుపై వేస్తున్నారు. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు సైతం అక్కడే చెత్తను వేస్తున్నారు. రెండు వారాల నుంచి చెత్త దుర్వాసన రావడంతో స్థానికులు 'ఆంధ్రజ్యోతి'కి సమాచారం ఇచ్చారు. దీనిపై ప్రత్యేక కథనం రావడంతో డీపీవో శిరీషారాణి స్పందించి, మండల స్థాయి, పంచాయతీ అధికారులను వివరణ కోరారు. దీంతో ఆగమేఘాలపై ఈవోపీఆర్‌డీ స్వామినాయుడు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెండు రోజులు చెత్తను ట్రాక్టర్‌పై తరలించారు. దీంతో సాయినగర్ ప్రజలు ఆంధ్రజ్యోతి దినపత్రికకు అభినందలు తెలియజేస్తున్నారు.



మెయిన్‌రోడ్డుపై చెత్తను తరలించి ఆ ప్రాంతం శుభ్రం చేయించిన అధికారులు

జ్వరాలు, పచ్చకామెర్ల ఉధృతి

నక్కపల్లి, మార్చి 21: మండలంలోని పలు గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలాయి. పిల్లల నుంచి పెద్దల వరకూ వైరల్ ఫీవర్స్, టైఫాయిడ్ ఫీవర్స్‌తో బాధపడుతున్నారు. మరి కొంతమంది పచ్చకామెర్లతో బాధపడుతున్నారు. స్థానిక 50 పడకల ఆస్పత్రికి రోజుకు 200 వరకూ రోగులు వస్తున్నారు. వీరిలో చాలా మంది జ్వరాలు, పచ్చకామెర్లతో బాధపడుతున్నవారేనని వైద్య సిబ్బంది తెలిపారు. వ్యాధి తీవ్రత వున్నవారిని ఆస్పత్రి జనరల్ వార్డులో చేర్పి వైద్యసేవలందిస్తున్నారు. మరికొందరు తుని సహా స్థానికంగా వున్న ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లకు వెళుతున్నారు. పెదతీనార్ల, జానకయ్యపేట, సీహెచ్‌ఎల్‌పురం, ఉపమాక, నక్కపల్లి, గొడిచెర్ల, ఉద్దండపురం, కాగిత, ఎన్.నర్సాపురం, రాజయ్యపేట, చందనాడ గ్రామాల్లో పలువురు సీజనల్ వ్యాధుల బారినపడుతున్నారు.



నక్కపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

ఘనంగా ఎల్లారమ్మ అమ్మవారి జాతర

రాంబిల్లి, మార్చి 21 : మండలంలోని నేవీ కాలనీలో గురువారం ఎల్లారమ్మ జాతరను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి, పసుపు, కుంకుమలను నివేదించి, భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. నిర్వాహకులు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించి, అమ్మవారిని దర్శించేందుకు భక్తులు బారులు తీరారు. అమ్మవారిని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమార్‌వర్మ, జడ్‌పీటీసీ సభ్యులు ధూళి నాగరాజు, వైసీపీ మండల కన్వీనర్ పి.కిషోర్, సచివాలయాల మండల కన్వీనర్ కొవిరి రామకృష్ణ, జనసేన పార్టీ నాయకులు సుందరపు విజయకుమార్, బైలపూడి రామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, పప్పల నూకన్నదొర పూజలు చేశారు.

'వైసీపీ నేతల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి'

మునగపాక (తుమ్మపాల), మార్చి 21 : మండలంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో వైసీపీ నాయకుల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించలేని పేదల స్థలాలను వైసీపీ నాయకులు ఆక్రమించుకుని ఆ పట్టాలను తమకు కావాల్సిన వారికి పంచుతున్నారని ఆరోపించారు. ఈ అంశంపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో అర్హుల జాబితాల నుంచి కొంత మంది పేర్లు తొలగించి, వాటి స్థానంలో కొత్త వారి పేర్లు చేరుస్తూ కోడ్ అమల్లో ఉన్నా పట్టాలు పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ఈ అంశం పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాడి ముసిలినాయుడు, ఆడారి మంజు, భీమరశెట్టి శ్రీనివాసరావు, ఆడారి జానకి, మళ్ల నరసింగరావు, ఆడారి జనార్దనరావు, ఆడారి గోవింద్ పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసీపీ నేత బాపూజీ



జనసేనలో చేరిన బాపూజీ

అచ్యుతాపురం, మార్చి 21: వైసీపీ జిల్లా కార్యదర్శి ద్వారపురెడ్డి బాపూజీ గురువారం జనసేన పార్టీలో చేరారు. జనసేన ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయకుమార్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈయన కొంత కాలంగా మంత్రి అమర్‌నాథ్ వర్గంలో చేరి ఎమ్మెల్యే కన్నబాబు రాజుకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. గురువారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌కు రాజీనామా పత్రం పంపించిన వెంటనే జనసేన పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కన్నబాబురాజు పార్టీ నేతలు, కార్యకర్తలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశాడన్నారు. ఈ విషయాన్ని గతంలో వైవీ సుబ్బారెడ్డికి కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఈకార్యక్రమంలో జనసేన నాయకులు బైలపూడి శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి: సీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ బుచ్చిరాజు

అచ్యుతాపురం, మార్చి 21: ప్రశాంత ఎన్నికల నిర్వహణకు అంతా సహకరించాలని అచ్యుతాపురం సీఐ బుచ్చిరాజు అన్నారు. గురువారం పూడిమడకలో ఎన్నికల కోడ్, శాంతి భద్రతలు, ఎన్నికల నియమావళి తదితర అంశాలపై అవగాహన సదస్సుని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏవిధమైన అల్లర్లు జరిగినా ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. ముఖ్యంగా చదువుకున్న యువకులు ఎన్నికల్లో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు.

'పెందుర్తి సీటుపై పునరాలోచన చేయాలి'

సబ్బవరం, మార్చి 21 : పెందుర్తి ఎమ్మెల్యే సీటు విషయంలో టీడీపీ అధినేత చంద్రబాబు పునరాలోచన చేయాలని డిమాండ్ చేస్తూ టీడీపీ మండల శ్రేణులు గురువారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశాయి. ముందుగా స్థానిక దుర్గాలమ్మ ఆలయం వద్ద అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి, వినతిపత్రం అందజేశారు. అనంతరం మండల కేంద్రంలో పార్టీ జెండాలు పట్టుకొని నిరసన ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు భరణికాన బాబూరావు, పీబీవీఎస్ఎన్ రాజు, బొండా సత్యారావు, మహాలక్ష్మీనాయుడు, గండి దేముడు, ముత్యాలనాయుడు, తదితరులు మాట్లాడుతూ.. అధిష్ఠానం పునరాలోచన చేసి పెందుర్తి నియోజవర్గాన్ని టీడీపీకి కేటాయించాలనీ, రెండు మూడు రోజుల్లో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దొడ్డి ప్రకాశ్, చంద్రశేఖర్, శీరం అప్పలరాజు, పల్ల తాతారావు, కోరాడ శ్రీను, పెద్దాడ రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నర్సీపట్నం పరిశీలకుడిగా చిక్కాల

పాయకరావుపేట రూరల్, మార్చి21: వైసీపీ నర్సీపట్నం నియోజకవర్గ పరిశీలకుడిగా పెంటకోట గ్రామానికి చెందిన చిక్కాల రామారావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ప్రస్తుతం విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకులుగా ఉన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వైసిపి నాయకులు చిక్కాల రామారావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బీజేవైఎం జిల్లా జనరల్ సెక్రటరీగా శ్రీకాంత్

పాయకరావుపేట రూరల్, మార్చి21: బీజేవైఎం జిల్లా జనరల్ సెక్రటరీగా పాయకరావుపేటకు చెందిన ఆచంట శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈయన పది సంవత్సరాలుగా పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తూ.. పార్టీ పలు పదవులు నిర్వహించారు. తనను నియమించిన బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గేదెల స్వరూప్‌కు, పార్టీ అధ్యక్షుడు పరమేశ్వరరావులకు శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు.

యూటీఎఫ్ నాయకుడు వెంకన్నస్వామికి నివాళులు

అనకాపల్లి టౌన్, మార్చి 21 : స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. వెంకటస్వామి చిత్రపటానికి యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన బ్బాయి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, కోశాధికారి రాజేష్, కార్యదర్శులు రమేష్‌రావు, జీఎస్ ప్రకాష్, శేషుకుమార్‌లతో పాటు దేముడునాయుడు, ఆషా, సలీమ్, రామచంద్రరావు పాల్గొన్నారు.

టీడీపీ నేత చిక్కాల శ్రీనుకి పలువురు పరామర్శ

పాయకరావుపేట, మార్చి 21 : కారు ప్రమాదంలో గాయపడిన టీడీపీ నాయకుడు చిక్కాల శ్రీనివాసరావుని గురువారం పలువురు ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్స తీసుకుని పట్టణంలో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న శ్రీనివాసరావును గురువారం టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను తదితరులు పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంది కాశీవిశ్వనాథం, కంకిపాటి వెంకటేశ్వరరావు, జూరెడ్డి ప్రసాద్, వేములపూడి అప్పారావు, చిరుకూరి పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.

పుర వీధుల్లో కేంద్ర బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

ఎలమంచిలి, మార్చి 21: రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు గురువారం పట్టణ వీధుల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ట్రైనీ డీఎస్పీ భవ్య, సీఐ ఎస్‌కే.గఫూర్‌ల పర్యవేక్షణలో ఎస్ఐ పావినాయుడు సిబ్బంది కవాతులో పాల్గొన్నారు. కవాతు పట్టణం వీధుల్లో నిర్వహించారు.

కన్నుల పండువగా శ్రీవారి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అనకాపల్లి టౌన్, మార్చి 21 : స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఫాల్గుణ శుద్ధ ఏకాదశి సందర్భంగా బుధవారం రాత్రి శ్రీవారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. కల్యాణం తిలకించడానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో టి. రాజసులోచన, అర్చకులు పులకండం విజయబాబు, పులకండం గిరిబాబు, రాజేష్, ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపర్చాలి

- డీఎస్పీకి బల్లా వినతి



డీఎస్పీకి వినతి అందజేస్తున్న బల్లా

అనకాపల్లి టౌన్, మార్చి 21 : పట్టణంలో ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపర్చాలని సిద్దార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం అనకాపల్లి డీఎస్పీ ఎస్.అప్పలరాజుకు గురువారం ఒక వినతిపత్రంలో కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీని సత్కరించిన అనంతరం ట్రాఫిక్ సమస్యపై వివరించారు. జిల్లా కేంద్రం కావడంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య అస్తవ్యస్తంగా ఉందన్నారు. పట్టణ జనాభా పెరగడంతోపాటు వాహనాల సంఖ్య కూడా పెరిగిందని, దీనివల్ల తరచూ ప్రధాన రహదారుల్లో వాహనచోదకులు ట్రాఫిక్‌లో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం ప్రజలకు ఏ విధమైన ప్రమాదాలు జరగకుండా కాపాడాలని కోరుతూ చేపల బజారు వద్ద గల సీతారాములకు అసోసియేషన్ సభ్యులు పూజలు చేశారు.

వలంటీర్, ఆర్‌పీలను దూరం పెట్టాలి

అనకాపల్లి టౌన్, మార్చి 21 : పట్టణానికి వలంటీర్లు, ఆర్‌పీలను నేటి నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు దూరంగా పెట్టాలని దళిత సంరక్షక సోషిత సమితి జిల్లా కన్వీనర్ మామిడి నూకరాజు గురువారం ఆర్డీవో కార్యాలయ డీటీకి ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. ఆర్‌పీలు, వలంటీర్లు అధికార పార్టీకి ప్రచారాలు చేస్తున్నారని, వైసీపీకి ఓటు వేయకపోతే పథకాలు తీసేస్తామని బెదిరిస్తున్నారన్నారు. అందువల్ల ఎన్నికలు పూర్తయ్యే వరకు వారిని విధుల నుంచి దూరం పెట్టాలని డీటీని కోరారు.

ఘనంగా నూకాంబిక అమ్మవారి పండగ

అచ్యుతాపురం, మార్చి 21: మార్టూరులో నూకాంబికా అమ్మవారి పండగ గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల సరిహద్దుల్లో అమ్మవారు ఉండడంతో రెండు మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. గురువారం రాత్రికి భారీ స్థాయిలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

పవన్ కోసమే రాజకీయాల్లోకి వచ్చాను

- జనసేన రాష్ట్ర కార్యదర్శి శివదత్

నక్కపల్లి, మార్చి 21: పవన్ కల్యాణ్‌ను చూసి రాజకీయాల్లోకి వచ్చానని, స్వలాభంతో రాజకీయాలు చేయడం లేదని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ చెప్పారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. 2019లో టికెట్ ఇవ్వకపోయినా తానేమీ నిరాశ పడలేదని, రాజకీయాలు వదలిపోలేదని, నియోజకవర్గాన్ని కనిపెట్టుకునే వున్నానని చెప్పారు. ఎవరెన్ని అవమానాలు చేసినా, ఆరోపించినా తాను పాయకరావుపేట నియోజకవర్గాన్ని విడిచిపెట్టే ప్రసక్తేలేదని, వెనక్కి తగ్గేదేలేదని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థినిగా పోటీ చేయచున్న వంగలపూడి అనితను గెలిపించడమే జనసైనికుల లక్ష్యమన్నారు. ఆయన వెంట జనసేన నాయకులు కురందాసు అప్పలరాజు, గబ్బర్ సింగ్, గణేశ్, బంగారి రాజు , యలమంచిలి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాహారం అవసరం

అచ్యుతాపురం, మార్చి 21: సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాహారం ఎంతో అవసరమని విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ అచ్యుతాపురం బ్లాక్ కో-ఆర్డినేటర్ మంత్రి హారిక అన్నారు. ట్రస్టుతో పాటు ఏషియన్ పెయింట్స్ భాగస్వామ్యంతో గురువారం పెదపాడులో జాతీయ పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సుని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ ధరలకే పోషక విలువలు గల ఆహారం దొరుకుతున్నా ప్రజలు తీసుకోవడం లేదన్నారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉషారాణి, మౌనిక, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు : ఎంపీడీవో

పాయకరావుపేట రూరల్, మార్చి 21: మండలంలోని అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పక్కాగా ఎన్నికల కోడ్ అమలు పరచాలని ఎంపీడీవో కె. స్వప్న అన్నారు. మండలంలోని శ్రీరాంపురం ఆర్‌బీకేలో వేసిన వైసీపీ రంగులను గురువారం తొలగించారు. ఈ సందర్భంగా ఆమె శ్రీరాంపురం ఆర్‌బీకేని సందర్శించారు. ఎటువంటి వివక్ష లేకుండా అన్ని పార్టీ రంగులు, నాయకుల ఫ్లెక్సీలను తొలగించాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ నిబంధనలను పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి వైవీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చెత్త శుద్ధి లేదాయే!

... 5వ పేజీ తరువాయి

నిధులు కేటాయించారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు ప్రతి 1,000 జనాభాకు ఒక గ్రీన్ అంబాసిడర్‌ను నియమించారు. వీరికి నెలకు రూ.6 వేల వేతనంగా నిర్ధారించారు. తడి, పొడి చెత్త సేకరణ, వర్మీకంపోస్టు తయారీ, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. వీరు రోజూ తమ పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, సంపద కేంద్రానికి తరలించాలి. తడి చెత్త, పశువులపేడతో వర్మీ కంపోస్టు ఉత్పత్తి చేయాలి. దీంతోపాటు పొడి చెత్త విక్రయం ద్వారా వచ్చే ఆదాయంతో గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించాలి. టీడీపీ అధికారంలో వున్నప్పుడు 20 పంచాయతీల్లో సంపద కేంద్రాలను నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. కైలాసపట్నం, కోటవురట్లలో సంపద కేంద్రాల నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయి. కె.వెంకటాపురం, రామన్నపాలెం, ఆక్సాహెబ్‌పేట పంచాయతీల్లో సంపద కేంద్రాల నిర్మాణ పనులు ప్రారంభించలేదు. వినియోగంలోకి వచ్చిన కేంద్రాల గ్రీన్ అంబాసిడర్లకు స్వచ్ఛభారత్ కార్యక్రమం ద్వారా ఏడాదిపాటు వేతనాలు ఇచ్చారు. కేంద్రాల్లో ఉత్పత్తి అయ్యే వర్మీ కంపోస్టు, పొడి చెత్త విక్రయం ద్వారా వచ్చే ఆదాయంతో గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు ఇవ్వాలని కేంద్రం ఆదేశించింది. ఏడాది తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణను గాలికొదిలేసింది. అత్యధిక పంచాయతీల్లో సంపద కేంద్రాల నుంచి తగిన ఆదాయం రాకపోవడం, పంచాయతీల వద్ద నిధులు లేకపోవడంతో గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు ఇచ్చే పరిస్థితి లేకపోయింది. దీంతో వారు విధులకు రావడం మానేశారు. దీనికితోడు సగానికిపైగా గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు లేకపోవడంతో సంపద తయారీ కేంద్రాలను పట్టించుకునేవారు లేకపోయారు. మండలంలో ప్రస్తుతం పాములవాక, బాపిరాజు కొత్తపల్లి, తంగేడు, పందూరు, రామచంద్రపురం పంచాయతీల్లో మాత్రమే సంపద కేంద్రాలు నడుస్తున్నాయి.

రోడ్లపక్కనే చెత్త డంపింగ్

సంపద తయారీ కేంద్రాలు మూతపడడంతో పారిశుధ్య సిబ్బంది ఇళ్ల నుంచి, వీధుల్లో సేకరించిన చెత్తాచెదారాన్ని గ్రామానికి శివారులో రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో డంపింగ్ చేస్తున్నారు. చెత్త కుప్పలు బాగా పేరుకుపోతే నిప్పు పెట్టి కాల్చేస్తున్నారు.

నిరుపేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

సబ్బవరం, మార్చి 21 : మండలంలోని ఇరువాడలో గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్టు ఆధ్వర్యంలో 30 మంది నిరుపేదలకు నిత్యావసర సరుకులను ట్రస్టు చైర్మన్ విజయ్‌కుమార్ గురువారం అందజేశారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ సోమేశ్వరరావు, శారా, పాసిల సూరిబాబు, ఎస్ నాయుడు, ఆనంద్, దివ్యతేజ, రమ్య పాల్గొన్నారు.

ముత్యాలమ్మతల్లి పండగ ప్రారంభం

సబ్బవరం, మార్చి 21: మండలంలోని అంతకాపల్లిలో ముత్యాలమ్మతల్లి పండగ బుధవారం రాత్రి నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి అమ్మవారికి పూజలు చేసి అనంతరం పండగ చాటింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సర్పంచ్ మాట్లాడుతూ.. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎస్‌టీ రామకాసు, గొంప ముత్యాలనాయుడు, శేఖర్, మూలినాయుడు, అడిగర్ల రాజు, ఎస్. నాయుడు, ఎస్. వెంకటరమణ, జే.నాయుడు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై విద్యార్థులకు అవగాహన

కశింకోట, మార్చి 21 : మండలంలోని తేగాడ, బయ్యవరం గ్రామాల్లో సేంద్రియ సాగుపై అవగాహన కార్యక్రమం గురువారం జరిగింది. ఐసీఆర్‌పీ ఆధ్వర్యంలో గుంటూరు బయోడైవర్శిటీ బోర్డు వారి సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసీఆర్‌పీలు సీహెచ్ నాగరాజు, కన్నయ్యమ్మ పాల్గొని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శారదా వ్యాలీ డెవలప్‌మెంటు సమితి స్వచ్ఛం సంస్థ కో-ఆర్డినేటర్లు కోన అప్పారావు, చక్రవరి పాల్గొన్నారు.

నర్సీపట్నం నియోజకవర్గం

'రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజన్ ప్రభుత్వం రావాలి'

నర్సీపట్నం, మార్చి 21 : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజన్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు అన్నారు. గురువారం పలువురు బీజేపీ నాయకులు అయ్యన్నపాత్రుడుని ఆయన నివాసంలో మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బీవీఎస్ వర్మ మాట్లాడుతూ నర్సీపట్నంలో విజయానికి బీజేపీ, జనసేన, టీడీపీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వి. రామచంద్రరాజు, కాళ్ల సుబ్బారావు, చిందాడ నూకేశ్వరరావు, అడిగర్ల సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా బోడకొండమ్మ పండగ

మాకవరపాలెం, మార్చి 21: మండలంలోని శెట్టిపాలెంలో బోడకొండమ్మ పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తూటిపాలలో ఎర్త్ అవర్‌పై విద్యార్థినులకు అవగాహన

మాకవరపాలెం,మార్చి 21: తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో ఈనెల 23న ఎర్త్ అవర్ పాటిద్దాం అంటూ విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కోసూరు రాము మాట్లాడుతూ అవసరం లేని లైట్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు స్విచ్ ఆఫ్ చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోడ్ అమలులో ఉన్నంత వరకు 144 సెక్షన్

కృష్ణాదేవిపేట, మార్చి 21: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నంతవరకు 144 సెక్షన్ ఉంటుందని కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం. ఉపేంద్ర తెలిపారు. అనుమతులు లేకుండా గుంపులు గుంపులుగా ఉండరాదని, ఏ రాజకీయ పార్టీ తరపున ప్రచారం చేయకూడదన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో రెండు పార్టీలకు చెందిన వ్యక్తులపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు.

ఎన్నికలకు అధికార యంత్రాంగం రెడీ

- సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎలక్షన్ సెల్
- నియోజకవర్గంలో 2వేల మంది ఎన్నికల సిబ్బంది
- అదనంగా మరో నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు

నర్సీపట్నం, మార్చి 21 : ఎన్నికలు ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉంది. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా నియోజవర్గం ఎలక్షన్ సెల్ ఏర్పాటు చేసింది. ఇక్కడ ఎన్నికల ప్రచార రథాలు, సభలు, సమావేశాలకు, వాహన అనుమతులు ఇస్తారు. నియోజవర్గంలోని నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం మండలాలలోని 262 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి రెండు వేల మంది పోలింగ్ సిబ్బందిని సిద్ధం చేశారు. ఇప్పటికే ఉన్న ఐదు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లకు అదనంగా మరో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. అకౌంటింగ్, వీడియో సర్వెలెన్స్, వీడియో వ్యూయింగ్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీమ్స్, స్టాటిక్ టీమ్‌లు పనిచేస్తున్నాయి. అభ్యర్థుల ఎన్నికల ఖర్చు పరిశీలించడానికి ఒక అధికారిని నియమించారు. ఈ టీమ్‌లు కోసం సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరి కింద భాగంలో ప్రత్యేకంగా విభాగం ఏర్పాటు చేశారు.



సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ ఎలక్షన్ సెల్

ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే చర్యలు తీసుకోవాలి

- నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వీ జయరాం

నర్సీపట్నం, మార్చి 21 : ఎన్నికల కోడ్‌పై ఫిర్యాదులు వస్తే తక్షణ చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి, నర్సీపట్నం ఆర్డీవో హెచ్‌వీ జయరాం ఆదేశించారు. గురువారం డీఎస్పీ జీఆర్ఆర్ మోహన్‌తో కలిసి ఎన్నికల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదు వస్తే తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత ఫొటోలు, వీడియోలు సి విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఐదుఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు పనిచేస్తున్నాయని, అదనంగా మరో నాలుగు టీమ్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. సెక్టార్ అధికారులు, పోలీస్ అధికారులు సమన్వయంగా పనిచేయాలన్నారు.



ఆర్డీవో జయరాం ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

వలంటీర్లు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనవద్దు

నాతవరం, మార్చి 21 : గ్రామ వలంటీర్లు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనవద్దని ఎంపీడీవో జె.రాంబాబు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళి సక్రమంగా అమలు అయ్యేటట్టు చూడాల్సి బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలదేనన్నారు. తహసీల్దార్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ ఇంకా ఎక్కడైన బ్యానర్లు, ఫ్లెక్సీలు ఉంటే వాటిని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

దివ్యాంగుల పునరావాస కేంద్రం ప్రారంభం

మాకవరపాలెం, మార్చి 21: దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు తమరాన సతీష్ అన్నారు. గురువారం ఇక్కడ దివ్యాంగుల పునరావాస భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. దివ్యాంగుల సొసైటీలో నర్సీపట్నం నియోజకవర్గంలో ఉన్న దివ్యాంగులు చేరాలన్నారు. కార్యక్రమంలో దివ్యాంగల ఉపాధ్యాక్షుడు సత్య మోహనగోపి, కోశాదికారి వడ్డాది రాములతో పాటు పలు గ్రామాల నుంచి దివ్యాంగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దివ్యాంగుల మండల అధ్యక్షుడు

ప్రలోభాలకు లొంగకుండా ఓటువేయండి



ఏఎల్‌పురంలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న వెలుగు ఏపీవో మంగ

కృష్ణాదేవిపేట, మార్చి 21 : రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా ఓటువేయాలని గొలుగొండ ఏపీఎం మంగ పిలుపునిచ్చారు. గురువారం ఏఎల్‌పురం హైస్కూల్‌లో ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గొలుగొండ ఏపీఎం మంగ మాట్లాడుతూ 85 సంవత్సరాల పూర్తయిన వృద్ధులు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పిస్తుందన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, కొండబాబు, కార్యదర్శులు శ్రీనివాస్, రాజేశ్, వీఆర్‌వో సాంబశివరావు, ఏఎస్ఐ నూకరాజు, వెలుగు సీసీ అప్పలనాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెత్త శుద్ధి లేదాయే!

... 5వ పేజీ తరువాయి

నిధులు కేటాయించారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు ప్రతి 1,000 జనాభాకు ఒక గ్రీన్ అంబాసిడర్‌ను నియమించారు. వీరికి నెలకు రూ.6 వేల వేతనంగా నిర్ధారించారు. తడి, పొడి చెత్త సేకరణ, వర్మీకంపోస్టు తయారీ, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. వీరు రోజూ తమ పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, సంపద కేంద్రానికి తరలించాలి. తడి చెత్త, పశువులపేడతో వర్మీ కంపోస్టు ఉత్పత్తి చేయాలి. దీంతోపాటు పొడి చెత్త విక్రయం ద్వారా వచ్చే ఆదాయంతో గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించాలి. టీడీపీ అధికారంలో వున్నప్పుడు 20 పంచాయతీల్లో సంపద కేంద్రాలను నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. కైలాసపట్నం, కోటవురట్లలో సంపద కేంద్రాల నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోయాయి. కె.వెంకటాపురం, రామన్నపాలెం, ఆక్సాహెబ్‌పేట పంచాయతీల్లో సంపద కేంద్రాల నిర్మాణ పనులు ప్రారంభించలేదు. వినియోగంలోకి వచ్చిన కేంద్రాల గ్రీన్ అంబాసిడర్లకు స్వచ్ఛభారత్ కార్యక్రమం ద్వారా ఏడాదిపాటు వేతనాలు ఇచ్చారు. కేంద్రాల్లో ఉత్పత్తి అయ్యే వర్మీ కంపోస్టు, పొడి చెత్త విక్రయం ద్వారా వచ్చే ఆదాయంతో గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు ఇవ్వాలని కేంద్రం ఆదేశించింది. ఏడాది తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణను గాలికొదిలేసింది. అత్యధిక పంచాయతీల్లో సంపద కేంద్రాల నుంచి తగిన ఆదాయం రాకపోవడం, పంచాయతీల వద్ద నిధులు లేకపోవడంతో గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు ఇచ్చే పరిస్థితి లేకపోయింది. దీంతో వారు విధులకు రావడం మానేశారు. దీనికితోడు సగానికిపైగా గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు లేకపోవడంతో సంపద తయారీ కేంద్రాలను పట్టించుకునేవారు లేకపోయారు. మండలంలో ప్రస్తుతం పాములవాక, బాపిరాజు కొత్తపల్లి, తంగేడు, పందూరు, రామచంద్రపురం పంచాయతీల్లో మాత్రమే సంపద కేంద్రాలు నడుస్తున్నాయి.

రోడ్లపక్కనే చెత్త డంపింగ్

సంపద తయారీ కేంద్రాలు మూతపడడంతో పారిశుధ్య సిబ్బంది ఇళ్ల నుంచి, వీధుల్లో సేకరించిన చెత్తాచెదారాన్ని గ్రామానికి శివారులో రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో డంపింగ్ చేస్తున్నారు. చెత్త కుప్పలు బాగా పేరుకుపోతే నిప్పు పెట్టి కాల్చేస్తున్నారు.

వైసీపీ నర్సీపట్నం పరిశీలకుడిగా చిక్కాల

పాయకరావుపేట రూరల్, మార్చి21: వైసీపీ నర్సీపట్నం నియోజకవర్గ పరిశీలకుడిగా పెంటకోట గ్రామానికి చెందిన చిక్కాల రామారావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ప్రస్తుతం విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకులుగా ఉన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వైసిపి నాయకులు చిక్కాల రామారావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'నిందితులను 24 గంటల్లో శిక్షించడం అభినందనీయం'

కశింకోట, మార్చి 21 : ఉత్తరప్రదేశ్‌లో పిల్లల హత్య కేసుకు సంబంధించి 24 గంటల వ్యవధిలో నిందితున్ని ఎన్‌కౌంటర్ చేయడం అభినందనీయమని మండల అంబేడ్కర్ యువజన సేవా సంఘం కార్యదర్శి జి. వెంకటరమణ అన్నారు. తప్పు చేసిన వారికి వెంటనే శిక్ష పడే విధంగా ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ యోగి చొరవతో పోలీసులు ఎన్‌కౌంటర్ చేయడం అభినందనీయమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకూడదంటే ఆదిత్యనాథ్ ఆలోచనే సరైన సమాధానమన్నారు.

చోడవరం నియోజకవర్గం

ఓటింగ్‌పై విద్యార్థులకు అవగాహన

చోడవరం, మార్చి 21: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటింగ్ ప్రక్రియపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో ఓటింగ్ నమోదు, ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాధాకృష్ణ, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కనకరాజు, అధ్యాపకులు మాల్యాద్రి, రఫియుద్దీన్, రత్న భారతి పాల్గొన్నారు.

వడ్డాది వెంకన్నకు ప్రత్యేక పూజలు

బుచ్చెయ్యపేట, మార్చి 21: వడ్డాది గిరిజాంబగిరిపై కొలువైన స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపఠనం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అభిషేకాలు చేశారు. దేవదాయ శాఖ ఈవో శర్మ భక్తులకు మౌలిక సదుపాయాలను కల్పించారు.

దుకాణాలకు కట్టిన డబ్బులు ఇవ్వడం లేదు

దేవదాయ శాఖ ఈవోపై వ్యాపారుల ఫిర్యాదు

చోడవరం, మార్చి 21: పట్టణంలోని హార్డింజి అతిథి గృహం స్థలంలో నిర్మించతలపెట్టిన దుకాణాల కోసం నిర్వహించిన వేలం సందర్భంగా శాఖ ఈవోకు తాము చెల్లించిన రూ.10 లక్షలు తిరిగి ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పట్టణానికి చెందిన వ్యాపారులు ఉప్పల బాబు, సుంకర సత్యనారాయణ ఉప్పల వెంకటేశ్, సిరసపల్లి శ్రీనివాసులు తదితరులు ఆరోపించారు. 15 నెలల క్రితం దుకాణాల కోసం వేలం నిర్వహించిన సందర్భంగా తాము ఒక్కొక్కరు రూ.25 లక్షల చొప్పున ఈవోకు డబ్బులు చెల్లించాక దరఖాస్తులు ఇచ్చామన్నారు.

దుకాణాల వేలం లేకపోవడంతో తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడుగుతుంటే, ఈవో స్పందించడం లేదని వ్యాపారులు వాపోయారు. తాము చెల్లించిన డబ్బులు తిరిగి వెనక్కి ఇవ్వాలని అడిగితే ఈవో నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవో తాము చెల్లించిన డబ్బులు తిరిగి వెనక్కి ఇవ్వని పక్షంలో అతనిపై కేసు పెడతామని వ్యాపారులు స్పష్టం చేశారు. అధికారులు స్పందించి తమ డబ్బులు తిరిగి వెనక్కి ఇప్పించేలా చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో దేవదాయ శాఖ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు. గురువారం ఈవోకు తమ డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ వినతిపత్రం ఇచ్చారు.



దేవదాయ శాఖ ఈవోకు వినతిపత్రం ఇస్తున్న వ్యాపారులు

ఉన్నతాధికారులకు నివేదించాం..

12 దుకాణాల కోసం నిర్వహించిన వేలం సందర్భంగా 12 మందికి నలుగురు మాత్రమే విడతల వారీగా రూ.2.5 లక్షలు శాఖకు చెల్లించారని దేవదాయ శాఖ ఈవో సత్యనారాయణ తెలిపారు. అయితే వేలం నిబంధనల ప్రకారం అందరూ పూర్తిగా డబ్బులు చెల్లించకపోవడంతో, వారి డిపాజిట్ సొమ్ము దేవదాయ శాఖకు చెందుతుందంటూ నోటీసులు ఇచ్చామని చెప్పారు. అయినా వారి నుంచి స్పందన లేకపోవడంతో పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించామని ఆయన చెప్పారు. నలుగురు వ్యాపారులు చెల్లించిన రెండున్నర లక్షల్లో రూ.50 వేలు మినహా మిగిలిన రూ.2 లక్షలు వారికి వస్తుందని చెప్పామన్నారు. నిబంధనల ప్రకారం మిగిలిన డబ్బులు దేవదాయ శాఖ నుంచి వచ్చే అవకాశం లేదని వ్యాపారులకు వివరించినట్టు ఆయన తెలిపారు.



దివ్యాంగుల వివరాలు నమోదు చేస్తున్న వైద్యులు, అధికారులు

దివ్యాంగ బాలలకు ఉపకరణాలు

చోడవరం, మార్చి 21: దివ్యాంగ బాలలకు అవసరమైన ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో జయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. స్థానిక భవిత కేంద్రంలో గురువారం జిల్లా సమగ్రశిక్షా, సహిత విద్యా ఆధ్వర్యంలో దివ్యాంగ బాల బాలికలకు ఉపకరణాల కోసం గుర్తింపు శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో దివ్యాంగుల వైకల్యం అధిగమించేందుకు అవసరమైన ఉపకరణాలు ప్రభుత్వం అందచేస్తుందని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త శకుంతలాదేవి తెలిపారు. ఈ శిబిరంలో ఎన్టీఆర్ ఆసుపత్రికి చెందిన డాక్టర్లు పాల్గొని దివ్యాంగులను పరీక్షించారు. వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, బ్రెయిలీ కిట్ల కోసం దివ్యాంగ బాలలు తమ పేర్లు నమోదు చేసుకున్నట్టు చెప్పారు. ఈ శిబిరంలో ఎంఈవో-2 సింహాచలం, ప్రత్యేక ఉపాధ్యాయులు బీఏ రాజు, జగన్నాథం, నాయడు పోలిరాజు, దేముడునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

రోలుగుంట, మార్చి 21: కొమరవోలు పంచాయతీ కార్యాలయం సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేపడుతున్న కర్రి రాజుబాబు, కర్రి శ్రీనుపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు బోళెం రమేష్, జనసేన నాయకుడు ఇటంశెట్టి జగ్గునాయుడు డిమాండ్ చేశారు. స్థలం ఆక్రమణపై ఇప్పటికే స్పందనతో పాటు ప్రభుత్వ కాల్‌సెంటర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. అధికారులు విచారణ చేపట్టి ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకుని పంచాయతీకి అప్పగించాలని కోరారు.

'టీడీపీ టికెట్‌పై పునరాలోచించాలి'

కె.కోటపాడు, మార్చి 21: మాడుగుల టిక్కెట్ కేటాయింపు విషయంలో అధిష్ఠానం పునరాలోచించాలని టీడీపీ నాయకులు గురువారం ర్యాలీ చేశారు. మాజీ ఎమ్మెల్యే రామానాయుడు లేదా పార్టీ ఇన్‌చార్జి పీవీజీ కుమార్‌కు టికెట్ ఇస్తే బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నేతలు కె.నాగభూషణం, డి.ఎరుకునాయుడు, బి.మహేశ్వరి, లక్ష్మీనరసింహమూర్తి, ఎస్.రమణ, కె.అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- సూపర్-6 పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి విజయానికి కృషి చేద్దాం
- టీడీపీ అభ్యర్థి పైలా ప్రసాదరావు

మాడుగుల/కె.కోటపాడు, మార్చి 21: సార్వత్రిక ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని టీడీపీ మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పైలా ప్రసాదరావు సూచించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు, బాబు ష్యూరిటీ. భవిష్యత్తుకు గ్యారంటీ, బాబు సూపర్‌సిక్స్ రిజిస్ట్రేషన్లు వేగవంతంగా చేయాలని సూచించారు. అదేవిధంగా చంద్రబాబు పెట్టిన పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అర్థమయ్యే రీతిలో వివరించాలని ఆయన కోరారు. అలాగే కె.కోటపాడు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గురువారం పైలా విస్తృతంగా పర్యటించారు. పంచాయతీలు, గ్రామాల వారీగా తెలుగుదేశం నాయకులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులు ఆయనకు స్వాగతం పలికారు. ఎన్నికలను సవాలుగా తీసుకుని టీడీపీ గెలుపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పైలా మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కలిగించి, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ మట్టి కరవడం ఖాయమని, బూడి ముత్యాలనాయుడు ఓటమికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. మాడుగుల కోసం ఒక అవకాశాన్ని ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ మాడుగుల అధ్యక్షులు రంజిత్‌వర్మ, క్లస్టర్ ఇన్‌చార్జి పుప్పాల రమేష్, పార్టీ మండల అధ్యక్షులు యూనిట్ ఇన్‌చార్జిలు పుప్పాల రమేష్, ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, కాళ్ల నర్సింగరావు, బాబ్జి, సూర్యప్రకాష్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పైలా ప్రసాదరావు

గ్రామాల్లో పోలీసుల కవాతు

చీడికాడ, మార్చి 21: మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు కవాతు గురువారం నిర్వహించారు. వరహాపురం బైలపూడి, దిబ్బపాలెం, దండిసురవరం, జి.కొత్తపల్లి, చినగోగాడ, కోనాం, ఖండివరం, ఎల్‌బి.పట్నం, అప్పలరాజుపురం గ్రామాల్లో ర్యాలీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ నారాయణరావు మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే నాయకుల ప్రచారాలు, ఓట్లు వేసినపుడు గ్రామస్థులు, ఓటర్లు అంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసులు పాల్గొన్నారు.



వరహాపురంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

దేవిపెద్దింటమ్మ జాతర ప్రారంభం

రోలుగుంట, మార్చి 21: మండలంలోని కుసర్లపూడిలో పెద్దింటమ్మ జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 24వ వరకు నిర్వహించే ఈ ఉత్సవాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు సర్పంచ్ మద్దు అప్పలనాయుడు తెలిపారు. ఈ నెల 24న జాతర ముగింపు ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. అలాగే ప్రతి రోజూ ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలని కోరారు.

వడ్డాది వెంకన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట, మార్చి 21: వడ్డాది గిరిజాంబగిరిపై కొలువైయున్న స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు సందర్భంగా గురువారం రాత్రి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ పండితుడు శ్రీకాంత్ ఆచార్యులు స్వామివారి ఆశీసులు అందించగా, వంశపర్య ధర్మకర్త దొండా శ్రీరామ్, దేవాదాయ శాఖ ఈఓ శర్మలు ఎమ్మెల్యే దంపతులకు శాలువలు కప్పి సన్మానించారు. ఆయన వెంట జోగా కొండబాబు ఉన్నారు.

మాడుగుల నియోజకవర్గం

పొత్తు ధర్మాన్ని పాటిద్దాం.. ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుందాం

కె.కోటపాడు, మార్చి 21: సార్వత్రిక ఎన్నికల్లో పొత్తు ధర్మాన్ని పాటించి బీజేపీ-తెలుగుదేశం-జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుందామని బీజేపీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి మేడపురెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు కొటాన ఈశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని పోలింగ్ బూత్‌లో బీజేపీ ఏజెంట్లను నియమించడంతో పాటు తెలుగుదేశం, జనసేన పార్టీల కార్యకర్తలను, నాయకులను కలుపుకొనిపోవాలని సూచించారు. అందరూ మిత్ర ధర్మం పాటించి తెలుగుదేశం, బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు బర్నికాన అప్పలకొండ కుమార్, ఇమంది సన్యాసిరావు, కూనిశెట్టి దాలినాయుడు, వరి వెంకట్రావు, శరగడం సన్యాసినాయుడు, బండారు సత్యనారాయణపాత్రుడు, బోలెం సురేష్, సిరికి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కోనాం వారపు సంతలో చింతపండుకు మంచి గిరాకీ



కోనాం సంతలో కొనుగోలుకు సిద్ధంగా ఉన్న చింతపండు

చీడికాడ, మార్చి 21: మండలంలోని కోనాం వారపు సంతకు వచ్చిన ఏజెన్సీ చింతపండుకు మంచి గిరాకీ ఏర్పడింది. దీంతో గిరిజన గ్రామాల నుంచి సరకు తీసుకువచ్చిన రైతులు ఆనందం వ్యక్తం చేశారు. మాడుగుల, పాడేరు, అనంతగిరి, హుకుంపేట మండలాలకు చెందిన ఏజెన్సీ గిరిజన గ్రామాల నుంచి ఉదయం 6 నుంచి 10 గంటల వరకు వారపు సంతకు రైతులు చింతపండు తీసుకువచ్చారు. స్థానిక వర్తకులతో పాటు మైదాన ప్రాంతంలోని వ్యాపారులు కూడా అదే సమయానికి సంతకు వచ్చారు. దీంతో ఉదయం 9 గంటల వరకు 50 కిలోల కావిడి చింతపండు రూ.2500 నుంచి రూ.3 వేల వరకు ధర పలికింది. అనంతరం అదే కావిడి రూ.2 వేలు నుంచి రూ.2500కు పడిపోయింది. ఈ వారం ఎక్కువ చింతపండు రావడంతో మధ్యాహ్నం 12 గంటల వరకు అమ్మకాలు జరిగాయి. గత వారం మాదిరిగానే ఈ వారం చింతపండుకు ధర రావడంతో గిరిజన రైతులు ఆనందంతో వారానికి సరిపడా నిత్యావసరాలు కొనుగోలు చేసి స్వగ్రామాలకు వెళ్లిపోయారు.

కొండచీపుర్లకు గిట్టుబాటు లేక గిరిజనుల నిరాశ

కొండచీపుర్లకు గిట్టుబాటు ధర లేకపోవడంతో గిరిజన రైతులు నిరాశ చెందారు. ఐటీడీఏ పరిధిలోని వివిధ మండలాల్లోని మారుమూల గ్రామాల నుంచి కొండచీపుర్లను కొంతదూరం నెత్తిపైన, అనంతరం ఆటోలపైన కోనాం సంతకు తరలించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరైన ధర లభించలేదు. పట్టణాల్లో రూ.80 నుంచి రూ.100 పలికే చీపుర ధర, ఇక్కడ రూ.50 నుంచి రూ.55కు మించి అమ్ముడుపోలేదు. 50 చీపుర్లను రూ.2500 నుంచి రూ.2800కు వ్యాపారులు కొనుగోలు చేశారు. కొండచీపుర్లకు జీసీసీ గిట్టుబాటు ధర కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

చీడికాడ, మార్చి 21: ఉద్యోగులంతా సమయపాలన పాటించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరి ఆదేశించారు. మండలంలోని కోనాం సచివాలయాన్ని గురువారం మధ్యాహ్నం ఆమె సందర్శించారు. ముందుగా రికార్డులు పరిశీలించి ఉద్యోగులు ఎవరెవరు వచ్చారో అడిగి తెలుసుకున్నారు. సచివాలయ పరిధిలో వివిధ పార్టీల కరపత్రాలు, ఫ్లెక్సీలు లేకుండా చూసుకోవాలని ఆమె ఉద్యోగులకు సూచించారు. అనంతరం ఉద్యోగులతో కలిసి గ్రామంలోని పలు వీధులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎ.సన్యాసిరావు, ఎం.వనిత, వీఆర్‌వో జివి.మూర్తి, మహిళ పోలీస్ రొంగలి రమాదేవి, వెల్ఫేర్ అసిస్టెంట్ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.